




తెలంగాణ శాసనసభ
తెలుగు దినపత్రిక

జిల్లా అనుబంధం

|| బుధవారం 09 అక్టోబర్ - 2024 || పేజీలు : 4


# రాత్రిపూట విచ్చలవిడిగా

# కాంట్రాక్టర్ పనులు’

- అభివృద్ధి పనుల్లో డొల్లతనం
- తుర్కయంజాల్‌లో నాసిరకంగా సీసీ రోడ్లు
- కాంట్రాక్టర్ల ఇష్టారాజ్యం
- అధికారుల పర్యవేక్షణ లోపం
- పట్టించుకోని మున్సిపల్ పాలకవర్గం

పేరు కు మాత్రం ఎ ఒన్ కాంట్రాక్టర్..



**తుర్కయంజాల్,శాసన సభ ప్రతినిధి :** తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో డొల్లతనం బట్టబయలైపోయింది. సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు కాంట్రాక్టర్లు నాసిరకంగా చేస్తున్నా అధికారులు మిన్నకుండటం పలు అనుమానాలకు తావిస్తోంది. గుత్తేదారులు తమకు నచ్చినట్టుగా, ఇష్టారీతిన వ్యవహరిస్తున్నా మున్సిపల్ ఇంజినీరింగ్ సెక్షన్ ఏమీ పట్టన్నట్టు వ్యవహరిస్తుండటం ఆశ్చర్యానికి గురిచేస్తోంది.

రాజధాని నగరానికి కూతవేటు దూరంలో ఉన్న తుర్కయంజాల్ మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దడమే ధ్యేయంగా ప్రభుత్వం ముందుకెళ్తోంది. ఇందులో భాగంగా మున్సిపాలిటీకి ఇటీవల సుమారు రూ.100కోట్ల నిధులను గవర్నమెంట్ రిలీజ్ చేసింది. ఈ నిధులతో మున్సిపాలిటీని సుందరంగా తీర్చిదిద్దాల్సిన అధికారులు, కాంట్రాక్టర్లు కాసులకు కక్కుర్తి పడుతున్నారు. అందినకాడికి దండుకోవడమే పరమావధిగా భావిస్తున్నారు. మున్సిపాలిటీలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో ఎక్కడా కూడా కాంట్రాక్టర్లు నాణ్యత పాటించకపోవడం చర్చనీయాంశమవుతోంది.



‘రాత్రిపూట విచ్చలవిడిగా కాంట్రాక్టర్ పనులు’పురపాలిక పరిధిలోని 7వ వార్డులో కొనసాగుతున్న సీసీ రోడ్డు పనుల్లో కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా వ్యవహరించడం స్థానికులను విస్మయానికి గురిచేసింది. నాగార్జునసాగర్ మెయిన్‌రోడ్డు నుంచి పాత రాగన్నగూడ గ్రామ పంచాయతీవరకు జరుగుతున్న సీసీ రోడ్డు పనుల్లో గుత్తేదారు తనకు తోచిందే వేదంగా పనులు చేయించడం స్థానికుల ఆగ్రహానికి తెరలేపింది.రాత్రి 11గంటలకు మిక్సర్లతో పనులు చేయించడం పట్ల పలువురు ప్రశ్నిస్తున్నారు. లక్షల రూపాయల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు పనులు నాసిరకంగా, సిమెంట్, ఇసుక నాణ్యత పాటించకుండా చేపట్టడం విమర్శలకు నెలవైంది. పనులు పగటి పూట చేయిస్తే అధికారులు, స్థానికులు నాసిరకంగాపై ప్రశ్నిస్తారన్న ఉద్దేశంతో గుత్తేదారు రాత్రి పూట పనులు చేయించడం పట్ల స్థానికులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడం చర్చనీయాంశమైంది.

తనకు తాను ఏ1 కాంట్రాక్టర్‌గా చెప్పుకునే ఓ గుత్తేదారు నాసిరకంగా పనులు చేపట్టడం పట్ల ప్రజలు విస్మయానికి గురవుతున్నారు. రాత్రిపూట కంకరతేలిన సీసీ రోడ్లను వేయిస్తూ ఎవరిని మభ్యపెట్టాలని చూస్తున్నారని అధికారులను ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇలాంటి కాంట్రాకర్లను బ్లాక్‌లిస్టులో పెట్టాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

**‘అధికారుల పర్యవేక్షణ లోపం’**

మున్సిపాలిటీ పరిధిలో ఎక్కడ ఎలాంటి అభివృద్ధి పనులు జరిగినా అధికారుల పర్యవేక్షణ కంపల్సరీ. ముఖ్యంగా సీసీ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనుల్లో ఇంజినీరింగ్ సెక్షన్ ముఖ్య పాత్ర వహిస్తుంది. ఇలాంటి పనులు జరుగుతున్న సమయంలో వర్క్ ఇన్‌స్పెక్టర్లు స్థానికంగా ఉండి పర్యవేక్షించాల్సి



ఉంటుంది. ముఖ్యమైన పనుల్లో ఏఈ, డీఈ వీరిని గైడ్ చేయాలి. అయితే తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలో ఎవరికివారు బాస్‌గా వ్యవహారం నడిపిస్తుండటం స్థానికుల ఆగ్రహానికి గురికావాల్సి వస్తోంది. ప్రజల నుంచి ఎలాంటి ఫిర్యాదులు అందినా డీఈ, ఏఈ నుంచి స్పందన రావడంలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఈ విషయంపై డి ఈ భిక్షపతిని వివరణ కోరగా ఏ ఈ చంద్రశేఖర్ రెడ్డికే తెలుసు నాకేం తెలవదు అని చెప్పడం విడ్డూరం..**

# చండూర్ లో లో బిజెపి సంబరాలు



**చండూర్ అక్టోబర్ 8 (శాసనసభ న్యూస్):**హర్యానాలో మూడోసారి అధికారం లోకి రావడం, జమ్మూ కాశ్మీర్లో మొట్టమొదటిసారి అత్యధిక స్థానాలు గెలుపు పొందిన సందర్భంగా మంగళవారం స్థానిక చౌరస్తాలో బిజెపి పార్టీ మున్సిపల్ పట్టణ అధ్యక్షులు పందుల సత్యం గౌడ్ ఆధ్వర్యంలో బాణ సంచ పేల్చి, మిఠాయి పంపిణీ చేసి సంబరాలు చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఓబీసీ అధికార ప్రతినిధి కోమటిక వీరేశం , మండల అధ్యక్షులు ముదిగొండ ఆంజనేయులు, డైరెక్టర్ బోడా ఆంజనేయులు , రాష్ట్ర నాయకులు భూతరాజు శ్రీహరి,సముద్రాల వెంకటేశ్వర్లు, రావిరాల శ్రీను , సామ వెంకట్ రెడ్డి, కోమటి ఓంకారం, పేర్ల గణేష్, బొబ్బిలి శివ,పరసనబోయిన శ్రీను,కటకం నరేష్,సిరిసనవాడ నాగరాజు, ఇరిగి ఆంజనేయులు, ఇరిగి కుమార్,తిరందాసు శ్రీను,కోమటి ఓంకారం,దోటీ శివ,పల్లెగోని చంద్రమౌళి, గోల్లూరి వెంకన్న,మంచుకోండ సాగర్,పాలకూరీ నరసింహ,నరసింహ తదితరులు పాల్గొన్నారు.



# మానవత్వం చాటుకుంటున్న అనంత చంద్ర శేఖర్ గౌడ్



**చండూర్ అక్టోబర్ 8 (శాసనసభ న్యూస్) :** చండూర్ మండలం లోని అంగడి పేట గ్రామానికి చెందిన అనంత చంద్ర శేఖర్ గౌడ్ హైదరాబాద్ లో బి ఎన్ రెడ్డి లోని సేఫ్ చిల్డ్రన్ ఫౌండేషన్ లో ఆయన పెద్ద కూతురు ప్రక్షిత జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనాద ఆడపిల్లలకు దుస్తులు, కిరాణంసరుకులు అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తాను గత 14 సంవత్సరాలుగా పిల్లల & వారి పెళ్లిరోజు అన్ని అనాదాశ్రమంలో నిర్వహిస్తున్నామని, అనాదలకు అండగా ఉండాల్సిన బాధ్యత మనపైన ఉందని తెలియ జేశారు. తను ప్రారంభించాక తన స్నేహితులు, బంధువులు చాలామంది ఇలాంటి కార్యక్రమాలు చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమం నిరంతరం కొనసాగుతూనే ఉంటుందని చెబుతూ, నాకు చాలా అందాన్ని ఇస్తుందని పేర్కొన్నారు. సేఫ్ చిల్డ్రన్ ఫౌండేషన్ కు సహాయం చేసినందుకు గాను అనంత చంద్ర శేఖర్ గౌడ్ కుటుంబానికి కృతజ్ఞతలు తెలియజేశారు.

# ఆటోలో ప్రయాణం.... అటో ఇటో.....

## - పరిమితికి మించి రవాణ.. పట్టించుకోని అధికారులు.

**చింతపల్లి, అక్టోబర్ 8 శాసనసభ న్యూస్ ప్రతినిధి :** పరిమితికి మించి ప్రయాణికులను తరలించడంవల్ల ఆటోలు అదుపు తప్పుతున్నాయి. ఆటో కెపాసిటీ నలుగురు మాత్రమే కాగా పది మందికి మించి ప్రయాణికులను ఆటోల్లో ఎక్కిస్తున్నారు. కూలీలను తీసుకువెళ్లే ఆటోలలో పదిహేను నుంచి 20 మంది వరకు ప్రయాణికులను తరలిస్తుంటారు. దీంతో ఆటోలు ప్రమాదాల బారిన పడుతున్నాయి. చింతపల్లి సాయి బాబా దేవాలయం వద్ద ఉదయం, సాయంత్రం పరిశీలిస్తే పది నుంచి ఇరవై ఆటోలకు పైగా కూలీలను రవాణా చేయడం కనిపిస్తుంది. మహిళా కూలీలు నిల్చోని, టాప్ మీద యువకులు కూర్చుని ప్రయాణించడం కనిపిస్తుంది. వరుస ప్రమాదాలు జరుగుతున్నా, ప్రమాదాల కారణాలు అధికారులకు తెలిసినా ఎవరూ పట్టించుకోకపోవడంతో ప్రమాదాల తీవ్రత పెరుగుతోంది.

**అతివేగం, అజాగ్రత్త...**ఆటో ప్రమాదాలకు ప్రధాన కారణం అతివేగం, నిర్లక్షపు డ్రైవింగ్, అజాగ్రత్తేనని పలువురు అభిప్రాయ పడుతున్నారు. డ్రైవర్ కు ఇరుపక్కల, లగేజీ వేసే చోట కూడా ప్రయాణికులను కూర్చొబెట్టి పరిమితికి మించి ప్రయాణికులను ఆటోల్లో తరలిస్తున్నారు. తగిన జాగ్రత్తలు పాటించకుండా



అతివేగంతో వాహనాలు నడపడం వల్ల, మద్యం సేవించి నడపడం వల్ల తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. డ్రైవర్లు పోటీ పడి నడపం వల్ల కూడా ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఇలా పరిమితికి మించి ప్రయాణికులను ఆటో క్లూజర్ తదితర వాహనంలో రవాణా చేస్తున్నారు. పరిమితికి మించి ప్రజలను వాహనంలో ఎక్కించుకొని రవాణా చేస్తే చర్యలు తప్పవని చింతపల్లి ఎస్సై బీన మోని యాదయ్య వాహనదారులను హెచ్చరించారు.

# నేటితో ముగిసిన నీటి సహాయకుల శిక్షణ తరగతులు





**చింతపల్లి, అక్టోబర్ 8 శాసనసభ న్యూస్ ప్రతినిధి :** చింతపల్లి మండల పరిషత్ కార్యాలయంలో తేది 04-10-2024 నుండి అంతర్గత మిషన్ భగీరథ శాఖ నిర్వహిస్తున్న గ్రామ మంచినీటి సహాయకుల శిక్షణా తరగతులు మంగళవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా మధ్యాహ్నం తర్వాత శిక్షణ పూర్తిచేసుకున్న గ్రామ మంచినీటి సహాయకులకు శిక్షణ ధ్రువీకరణ పత్రాలు అందజేశారు . ఈకార్యక్రమానికి డి. శాంత కుమారి ఈఈ, ఎంబీ ఇంట్ర నల్గొండ. సి సుజాత ఎంపీడీవో చింతపల్లి జి. వెంకటేశ్వర్లు ఏఈ ఎంబి మర్రిగూడ. బి. శేఖర్ ఏఈ ఎంబి ఇంట్రా చింతపల్లి. ఇన్చార్జ్ ఆఫ్ వాటర్ క్వాలిటీ ల్యాబ్ ఎంపీ ఇంట్రా వీరా రెడ్డి డివిజనల్ నల్గొండ. పి. శ్రీనివాసులు జూనియర్ అసిస్టెంట్ ఎంబి ఇంట్రా దేవరకొండ. డి. వెంకటయ్య జూనియర్ అసిస్టెంట్ ఎంబి ఇంట్రా దేవరకొండ. 20 మంది మంచినీటి సహాయకులు మర్రిగూడ మండలము నుండి 20 మంది మంచినీటి సహాయకులు చింతపల్లి మండలము నుండి 20 మంది పాల్గొన్నారని ఏఈ ఎంబి ఇంట్రా బి శేఖర్ తెలిపారు.

# అరుదైన జంతువులను ఆన్లైన్లో అమ్మేస్తున్నారు

**శాసనసభ న్యూస్ ప్రతినిధి :** జంతువులను వేటాడుతున్న ముఠా అంతరించిపోతున్న జంతువులను వేటాడడానికి ముఠాలు తిరుగుతున్నాయి. అడవులలో ఉండే అలుగు, పులి, చిరుత, వాటి చర్మం, నక్షత్ర తాబేలు, రెండు తలల పాము, ఏనుగు దంతాలకు భారీగా డిమాండ్ ఉంటుందనే అపోహతో వీటికోసం వివిధ ప్రాంతాలకు వెళ్తుంటారు. కొన్ని ముఠాలు అరుదైన జంతువులకు ధరలు ఊహించుకుని వాటిని గుట్టుగా వేటాడుతూ దందా నడుపుతున్నారు. వాట్సాప్ గ్రూపు ఏర్పాటు : పాంగోలిన్ లాంటి అరుదైన వన్యప్రాణుల విక్రయాలకు దేశవ్యాప్తంగా పెద్ద నెట్వర్క్ ఉన్నట్లు సమాచారం. పురాతన వస్తువుల పేరిట దేశవ్యాప్త నెట్వర్క్తో ఓ వాట్సాప్ గ్రూపు నడుపుతున్నారు. ఇందులో భూపాలపల్లి జిల్లాకు చెందిన కొందరు ఉన్నట్లు తెలిసింది. వారే అలుగు ఫొటోలను అప్లోడ్ చేసి అమ్మకానికి పెట్టారు.. ఇలాంటి నెట్వర్క్తో ఇక్కడి వారికి సంబంధాలు ఉండటం విస్తుగొల్పుతోంది. ఎన్నేళ్లుగా ఈ అక్రమ వ్యాపారం జరుగుతుందో తెలుసుకునే పనిలో అటవీ అధికారులు, పోలీసులు ఉన్నారు. ఉచ్చులు విద్యుదాఘాతం :



జయశంకర్ భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్, వరంగల్ తదితర జిల్లాల్లో దట్టమైన అటవీ ప్రాంతాల్లో వన్యప్రాణులున్నాయి. పులులు, చిరుతలు, జింకలు, దుప్పులు, కొండగొర్రెలు, కుందేళ్లు, అడవి దున్నలు, అడవి పందులు, తదితర జంతువులున్నాయి. రాత్రి వేళల్లో గుట్టుగా విద్యుదాఘాతం, ఉచ్చులతో వేటాడుతున్నారు. విద్యుదాఘతంతో మనుషులకు ప్రమాదాలు జరుగుతున్నాయి. నాలుగేళ్ల క్రితం తాడ్వాయి అడవుల్లో పులిని కూడా వేటాడి చంపారు."వన్యప్రాణుల వేటను అరికడుతున్నాం. వేటతో జరిగే అనర్థాలపై అవగాహన కల్పిస్తున్నాం. వన్యప్రాణుల చట్టాలు, శిక్షలపై వివరిస్తున్నాం. రాత్రిపూట గస్తీ బృందాలను ఏర్పాటు చేశాం. ప్రజలు కూడా సహకరించాలి. వన్య ప్రాణుల వేటపై సమాచారం ఇవ్వాలని కోరుతున్నాం." -వసంత, డీఎఫ్వో, జయశంకర్ భూపాలపల్లి హాని తలపెడితే శిక్ష తప్పదు : వన్యప్రాణి సంరణక్ష చట్టం-1972 ప్రకారం కఠిన శిక్షలు ఉన్నాయి. పులిని ఆటపట్టించినా భయపెట్టినా ఆరు నెలలు శిక్ష పడుతుంది.

శాసనసభ

బుధవారం 09 అక్టోబర్ - 2024

# తెలంగాణలో భావితరాలకు బసట హైడ్రా



**చండూర్ అక్టోబర్ 8 (శాసనసభ న్యూస్) :** కాంగ్రెస్ పార్టీ ఎస్సీ డిపార్ట్మెంట్ నల్గొండ జిల్లా వైస్ చైర్మన్ కురుపాటి గణేష్ తెలంగాణ రాష్ట్ర ప్రజలారా భయపడకండి ఆలోచించండి ప్రతిపక్ష పార్టీ నాయకుల మాటలు నమ్మకండి తెలంగాణలో భావితరాలకు బసటగా రానున్న రోజుల్లో హైడ్రా నిలుస్తుందని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ డిపార్ట్మెంట్ నల్గొండ జిల్లా వైస్ చైర్మన్ కురుపాటి గణేష్ అన్నారు చండూర్ మండల కేంద్రంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ భవితకు కాంగ్రెస్ పార్టీ గ్యారంటీ ఇస్తుంది ప్రతి సంవత్సరం ప్రకృతి వైపరీత్యాల కారణంగా వరద బాధితులకు వేలకోట్ల నష్టం ఏర్పడుతుంది దీనికోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వరద సహాయక చర్యల కోసం ఎన్ని వేలకోట్లు ఇచ్చినప్పటికీ ఆరోకరంగా సాయం అందుతుంది దీనివల్ల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వైఫల్య చెందుతున్నాయి గత 60 సంవత్సరాల కాలంలో అనేక పార్టీల రాష్ట్ర ప్రభుత్వాలు ఏర్పాటు అయినప్పటికీ ఆ ప్రభుత్వంలో వైఫల్యం కారణంగా నిరంతరం ప్రకృతి వైపరీత్యాల ఏర్పడడం జరుగుతుంది. దీనికి ముఖ్య కారణం తెలంగాణ రాష్ట్రంలో ఉండబడినటువంటి చెరువులు కుంటలను ఆక్రమించుకొని ఇండ్లు పార్కులు ఎన్కన్వన్షన్లు నిర్మించడం వల్ల ప్రకృతి వైపరీత్యాలు ఏర్పడుతున్నాయి దీనిని నిర్మూలించడానికి తెలంగాణ రాష్ట్రంలో ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం గౌరవ ముఖ్యమంత్రివర్యులు శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి గారు హైడ్రా అనే సంస్థను స్థాపించి రాష్ట్రంలో ఉ ఒడబడిన ఉమ్మడి ఆస్తులైన చెరువులు కుంటలను భవిష్యత్ అందించాలన్నటువంటి లక్ష్యంతో ప్రకృతి వైపరీత్యాలను నిర్మూలించాలనే కాంక్షతో ఎవరి ఒత్తుళ్లకు లొంగకుండా పటిష్టమైన ఆలోచన విధానంతో ఎందుకు వెళ్లి రాష్ట్ర అభివృద్ధిని కోరుకోవడం జరుగుతుంది కావున ప్రతిపక్ష నాయకులు గోరంతలు చేయకుండా మేధావులు విద్యార్థి సంఘ నాయకులు ప్రజలు ఆలోచించవలసిన ఆవశ్యకత ఉందని అన్నారు...

## నల్గొండ: రైతులకు ఇబ్బంది లేకుండా పత్తిని కొనుగోలు చేయాలి

### - జిల్లా కలెక్టర్



**చండూర్ అక్టోబర్ 8 (శాసనసభ న్యూస్):** రైతులకు ఎలాంటి ఇబ్బందీ లేకుండా పత్తిని కొనుగోలు చేయాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి సోమవారం అధికారులకు ఆదేశించారు. నల్గొండ జిల్లా లో 23 పత్తి కొనుగోలు కేంద్రాలను ఈ నెల 15 లోగా ప్రారంభించాలని సమావేశంలో నిర్ణయించారు. రాష్ట్ర ప్రభుత్వం పొడవు గింజ పత్తిని రూ.7521, మధ్యస్థ గింజ పత్తిని 7121 మద్దతు ధర కన్నా తక్కువగా కొనుగోలు చేయవద్దన్నారు.

## అంగరంగ వైభవంగా అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు - అనంత చంద్ర శేఖర్ గౌడ్





**చండూర్ అక్టోబర్ 8 (శాసనసభ న్యూస్) :** చండూరు మున్సిపాలిటీ అంగడిపేట గ్రామంలో దుర్గ నవరాత్రి ఉత్సవాలు అనంత చంద్ర శేఖర్ గౌడ్ అద్వర్యం లో 6వ వార్షికోత్సవం సందర్భంగా ఘనంగా నిర్వహించారు. 6 వ రోజు కుంకుమార్చన నిర్వ హించారు మహిళలు పాల్గొని విజయవంతం చేయడం జరిగింది.

## ప్రతి ఒక్కరు దుర్గామాత ఆశీస్సులు పొందాలి

### బిఆర్ఎస్ పార్టీ నాయకులు, తీదేడు పిఎసిఎస్ డైరెక్టర్ తిరుమణి పాపయ్య



**చింతపల్లి, అక్టోబర్ 8 శాసనసభ న్యూస్ ప్రతినిధి :** ప్రతి ఒక్కరు దుర్గామాత ఆశీస్సులు పొందాలని బిఆర్ఎస్ పార్టీ నాయకులు తీదేడు గ్రామ పి.ఏ.సి.యస్ డైరెక్టర్ తిరుమణి పాపయ్య అన్నారు.తీదేడు గ్రామంలో రామాలయం వద్ద దుర్గామాత నవరాత్రుల ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన దుర్గామాతవద్ద ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం ఆయన అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుర్గమ్మ ఆశీస్సులతో గ్రామ ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకుంటున్నామన్నారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ ప్రసారంలో అంతరాయం

- విద్యుత్ సిబ్బందికి సహకరించండి .
- మండల విద్యుత్ అధికారి మురళి



**చింతపల్లి, అక్టోబర్ 8 శాసనసభ న్యూస్ ప్రతినిధి :** చింతపల్లి మండలం వెంకటంపేట (తీదేడు) సబ్ స్టేషన్ పరిధిలో బుధవారం మధ్యాహ్నం 12 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ 33/11 కె.వి మరమ్మతులు జరుగుతున్నందున నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేయబడుతుందని విద్యుత్ మండల అధికారి మురళి ఒక ప్రకటన తెలియజేశారు. తీదేడు గ్రామ ప్రజలు విద్యుత్ సిబ్బందికి సహకరించాలని ఏ.ఇ కోరారు.

## మైనర్ బాలికపై దాడికి పాల్పడిన యువకుడికి రిమాండ్



**చండూర్ అక్టోబర్ 8 (శాసనసభ న్యూస్) :** నల్గొండ జిల్లా చండూర్ మండలం లోని ఒక గ్రామం చెందిన మైనర్ బాలికపై దాడికి పాల్పడిన యువకుడిని సోమవారం రోజున అరెస్టు చేసి రిమాండ్ కు పంపినట్లు గా సర్కిల్ ఇన్ స్పెక్టర్ వెంకటయ్య తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఒంగోలు రూరల్ దేవారంపాడు కు చెందిన వాటుపల్లి బాబి (24). అదే గ్రామం లో మేస్త్రి పని చేస్తూ అక్కడే నివాసం ఉంటున్నాడు. ఆదివారం సాయంత్రం మద్యం మత్తు లో ఒంటరిగా ఉన్న బాలికపై దాడికి పాల్పడినట్లు బాలిక తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని నిందితుని అరెస్టు చేసి రిమాండ్ పంపినట్లు సర్కిల్ ఇన్ స్పెక్టర్ వెంకటయ్య తెలిపారు.

## కురుమేడు హనుమాన్ ఆలయంలో మహాలక్ష్మి అవతారంలో అమ్మవారు దర్శనం

### - కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో 20 వెల రూపాయలతో అమ్మవారికి అలంకరణ



**చింతపల్లి, అక్టోబర్ 8 శాసనసభ న్యూస్ ప్రతినిధి :** చింతపల్లి మండలం కురుమేడు గ్రామంలో కొలువై ఉన్న దుర్గామాతకు నిత్యం కొనసాగుతున్న శరన్నవరాత్రి ఉ త్సవాలు. ప్రతిరోజు నిత్య పూజలు అందుకుంటూ రోజుకో అవతారంలో దర్శనమిస్తున్న అమ్మవారి అవతారం. ఈ సందర్భంగా దుర్గామాతను కమిటీ సభ్యులు 20,000 వేల రూపాయలతో అలంకరించడం జరిగింది. మహాలక్ష్మిని అలంకరించిన వారిలో గజ్జ అనిల్,అలవాల సతీష్,తవిటి రామకృష్ణ, గౌని శ్రీకాంత్ ,వెంకట పేట జంగయ్య, కుంభం మహేష్,గజ్జ ఆనంద్,ముద్దం శివ,అలవాల చింటూ,ముద్దం రామ్, గౌని శివ, చాత తేజ్ ,ముద్ధం లక్ష్మణ్ ,బుర్రి బద్రి, తేటపల్లి శ్రీరాములు,జడ శివ, జెల్ల శ్రీశైలం, షీలా చందు,కుంభం జశ్వంత్,గునిగంటి శివ, గజ్జ శివ, తెరటిపల్లి బన్నీ తదితరులు పాల్గొన్నారు.

# కిచెన్‌కు రానంటున్న టమోటా..!
# కోయకుండానే కన్నీరుపెట్టిస్తున్న ఉల్లిగడ్డ..



హైదరాబాద్,శాసనసభ ప్రతినిధి : తెలంగాణ... ఆంధ్రప్రదేశ్..లో టమోటా ధరలు భారీగా పెరుగుతున్నాయి. నెలన్నర క్రితం వరకు కిలో 20 నుంచి 30 రూపాయలు పలికిన టమాటా ధర ఇప్పుడు భారీగా పెరిగింది.గత పదిహేను రోజుల్లో టమాటా ధర డబుల్ అయింది. ప్రస్తుతం హెూల్ సేల్ మార్కెట్‌లో కిలో టమాటా 70 నుంచి 80 రూపాయలు పలుకుతోంది. రిటైల్ అయితే 100 దాటినట్లు తెలుస్తోంది. డిమాండ్‌కు సరిపడ టమాటా రాకపోవడమే ఇందుకు కారణమని చెబుతున్నారు కూరగాయల వ్యాపారులు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు టమాటా పంటలు దెబ్బతిన్నాయని.. దీంతో ధరలు అమాంతం పెరిగాయని చెబుతున్నారు వ్యాపారులు. హైదరాబాద్‌కు తెలంగాణలోని జిల్లాల నుంచే కాకుండా రాయలసీమ, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి కూడా టమాటా వస్తుంది. ఇతర రాష్ట్రాల నుంచి పంట రాక తగ్గడంతో పాటు..రాష్ట్రంలో దిగుబడి తగ్గటంతో ధరలు పెరిగినట్లు అంచనా వేస్తున్నారు. సాధారణంగా టమాటా ధర వేసవి కాలంలో ఎక్కువగా ఉంటుంది. ఈ సమయంలో ధర తక్కువగా ఉండాలి.భారీ వర్షాలతో దిగుబడి తగ్గి ధర పెరిగినట్లు చెబుతున్నారు. ఈ ధరలు మరో నెల పాటు కొనసాగే అవకాశం ఉందని చెబుతున్నారు. కొత్త పంట చేతికి వచ్చే వరకు ఇవే ధరలు ఉంటాయని అంచనా వేస్తున్నారు. ఉల్లి ధరలు కూడా భారీగానే పెరిగింది. రిటైల్ మార్కెట్ లో కిలో ఉల్లి 60 నుంచి 70 రూపాయలు పలుకుతోంది. కేంద్రం ఉల్లి ఎగుమతిపై సుంకం ఎత్తివేయడంతో ధరలు భారీగా పెరిగాయి. ఐతే సామాన్యులపై భారాన్ని తగ్గించడానికి కేంద్రం బఫర్ స్టాక్‌ను రిలీజ్ చేసింది. అలాగే నాఫెడ్ ద్వారా 35 రూపాయలకే కిలో ఉల్లిని విక్రయిస్తోంది. ఇక, వెల్లుల్లి ధర కూడా భారీగానే పెరిగింది. మంచి క్వాలిటీ ఉన్న వెల్లుల్లి కిలో 500 పలుకుతోంది. ఇక మిగతా కూరగాయల ధరలు కూడా భారీగానే ఉన్నాయి. ఇక స్కిన్ లెస్ చికెన్ కిలో 300లకు పెరిగింది. కోడి గుడ్ల ధరలు కూడా పెరిగాయి. గుడ్డు ఒక్కొటి 6 రూపాయలు పలుకుతున్నాయి. ఇది చాలదు అన్నట్లుగా వంట నూనె ధరలు కూడా పెరిగాయి. దీంతో సామాన్యుడు బతకలేని పరిస్థితి ఏర్పడింది.

# హిందూ టెంపుల్ ఆఫ్
## సెంట్రల్ ఇండియానా పోలీస్ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు



ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 8 శాసనసభ న్యూస్ ప్రతినిధి : అమెరికాలోని ఇండియానాపోలీస్ ప్రాంతంలో తెలుగు అసోసియేషన్ అఫ్ ఇండియానా వారి ఆధ్వర్యంలో హిందూ టెంపుల్ అఫ్ సెంట్రల్ ఇండియానాపోలీస్ వారు ఘనంగా బతుకమ్మ సంబరాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణాకు చెందిన పలు ప్రాంతాలనుండి వచ్చి స్థిరపడిన తెలుగువాళ్ళు అందరు బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రామోజీ ఫిల్మ్ సిటీ ఏరియా కి చెందిన లయన్ పరిణీత రాజేష్ (మారిశెట్టి )దంపతులు ఏంతో వైవిధ్యమైన, సృజనత్మాకాతతో బతుకమ్మలను తయారుచేసి, మన సంప్రదాయాలను వెల్లి విరిసేలా చేయడం మన తెలుగు వారికి గర్వకారణం.వారు ప్రతి సంవత్సరం ఇదే విధంగా తన సృజనత్మాకతను తెలియచేస్తారని లయన్ కె.వి రమేష్ రాజు డిస్ట్రక్ట్ కాబినెట్ మెంబెర్ వారికి అభినందనలు తెలిపారు.

# సీఎం రేవంత్ తీరును నిరసిస్తూ నేడు రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు: మందకృష్ణ మాదిగ



హైదరాబాద్,శాసనసభ ప్రతినిధి : ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ చేయకుండానే ఉద్యోగాలను భర్తీ చేస్తున్నారంటూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై ఎమ్మార్పీఎస్ అధినేత మంద కృష్ణ మాదిగ విమర్శలు గుప్పించారు.మాలలకు అనుకూలంగా ఉంటూ.. మాదిగలకు అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. రేవంత్ తీరును నిరసిస్తూ రేపు రాష్ట్ర వ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రాల్లో అంబేద్కర్ విగ్రహాల నుంచి కలెక్టర్ కార్యాలయాల వరకు ర్యాలీ నిర్వహించి, ధర్నాలు చేయాలని చెప్పారు. కలెక్టర్లకు వినతి పత్రాలు ఇవ్వాలని సూచించారు.మాదిగలకు రేవంత్ ప్రభుత్వం నమ్మకద్రోహం చేసిందని.. నమ్మించి నట్టేట ముంచిందని మంద కృష్ణ విమర్శించారు. మాదిగల పట్ల ఎనలేని ప్రేమ ఉన్నట్టు నటిస్తూ.. మాలల కొమ్ము కాస్తున్నారని మండిపడ్డారు. రేవంత్ పీసీసీ చీఫ్ గా ఉన్నప్పుడు అసెంబ్లీ ఎన్నికల్లో మాలలకు ఎక్కువ టికెట్లు ఇచ్చి, మాదిగలకు తక్కువ సీట్లు ఇచ్చారని అన్నారు. రేవంత్ వల్లే అసెంబ్లీ ఎన్నికల్లో మాదిగలకు నాలుగు సీట్లు తగ్గాయని చెప్పారు.

# నగల కోసం నమ్మకంగా ఉంటూ ప్రాణం తీశాడు

**- విషాదాంతంగా సీఐ తల్లి మిస్సింగ్ కేసు**



హైదరాబాద్,శాసనసభ ప్రతినిధి : ఏపీలోని ధర్మవరం సీఐ నాగేంద్ర ప్రసాద్ తల్లి మిస్సింగ్ కేసు విషాదాంతం – ఇంటి సమీపంలోనే ఉంటున్న వ్యక్తి బంగారు నగల కోసం హత్య ఏపీలోని ధర్మవరం సీఐ నాగేంద్ర ప్రసాద్ తల్లి మిస్సింగ్ కేసు విషాదాంతంగా ముగిసింది. 62 ఏళ్ల స్వర్ణకుమారి హత్యకు గురైనట్లు పోలీసులు గుర్తించారు. తన అనారోగ్య సమస్యలకు స్వామీజీలను నమ్ముకోవడమే ఆమె మృతికి కారణమైంది. నగల కోసం ఇంటిపక్కన ఉన్న వ్యక్తే సీఐ తల్లిని హత్య చేసినట్లు పోలీసులు తేల్చారు. నిందితుడిని అరెస్టు చేసిన అనంతరం, అతడిచ్చిన సమాచారం మేరకు స్మశానంలో పూడ్చిపెట్టిన స్వర్ణ కుమారి శవాన్ని వెలికి తీసి అక్కడే పంచనమా నిర్వహించారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం : అమ్మ చెరువు మిట్ట జగనన్న కాలనీలో నివాసం ఉంటున్న సీఐ నాగేంద్ర ప్రసాద్ తల్లి స్వర్ణకుమారి (62) గత నెల 28వ తేదీన అదృశ్యమయ్యారు. దీంతో ఈ నెల 2వ తేదీన స్వర్ణకుమారి బంధువుల మదనపల్లె పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. అప్పటి నుంచి పోలీసులు గాలింపు చేపట్టారు. ఈ నేపథ్యంలో మంగళవారం స్వర్ణకుమారి స్మశానంలో శవమై కనిపించారు.ఇంటి పక్కన వ్యక్తే హత్య: స్వర్ణకుమారిని ఆమె ఇంటి సమీపంలోనే ఉంటున్న వ్యక్తి హత్య చేసినట్లుగా పోలీసులు గుర్తించారు. నిందితుడు వెంకటేష్ మృతురాలి ఇంటి సమీపంలోనే నివాసముంటూ చాలా నమ్మకంగా ఉండేవాడు. ఈ నేపథ్యంలో గత నెల 28వ తేదీ ఆమెను ఆరోగ్య సమస్యల పరిష్కారం కోసం స్వామీజీ వద్దకు తీసుకెళ్లినట్లు సమాచారం. ఆ తర్వాత స్వర్ణకుమారి ఇంటికి రాలేదు. దీన్ని గమనించిన స్థానికులు కొంతమంది సమాచారాన్ని మృతురాలి బంధువులకు అందించారు. అనుమానితుడిగా ఉన్న వెంకటేష్ ఊరు వదిలి వెళ్లిపోయాడు. చివరకు పోలీసులు అతన్ని పట్టుకొని సమాచారం రాబట్టారు.నగల కోసమే అఘాయిత్యం: నిందితుడు మృతదేహాన్ని గోనె సంచిలో చుట్టి అన్నమయ్య జిల్లా మదనపల్లి పట్టణం అయోధ్య నగర్ సమీపంలోని స్మశాన వాటికలో పూడ్చి పెట్టాడు. జరిగిన వ్యవహారం పోలీసులకు నిందితుడు వెంకటేష్ చెప్పి మృతదేహాన్ని పూడ్చి పెట్టిన ప్రదేశానికి తీసుకెళ్లాడు. పోలీసులు మృతదేహాన్ని బయటకు తీసి అక్కడే పంచనామా నిర్వహించారు. కాగా నిందితుడు వెంకటేష్‌తో పాటు మరో నిందితుడు అనిల్ కలసి స్వర్ణ కుమారిని హతమార్చినట్లు పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది.స్వర్ణ కుమారి వద్ద ఉన్న బంగారు నగల కోసమే వీరు అఘాయిత్యానికి పాల్పడినట్లు పోలీసులు వివరించారు. హత్య జరిగిన మరుసటిరోజే వెంకటేష్ స్వర్ణ కుమార్‌కి చెందిన నగలను పట్టణంలోని ఓ బంగారు నగర దుకాణంలో కుదువ పెట్టినట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


శాసనసభ
తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

కేంద్ర ప్రభుత్వంచే గుర్తించబడిన తెలంగాణ శాసనసభ
తెలుగు దిన పత్రికలో ఈ ప్రాంతాల్లో వార్తలు
సేకరించడానికి విలేకరులు కావలెను.
తెలుగులో రాయగల సమర్థత, సమాజం పట్ల అవగాహన ఉంటే చాలు

నల్గొండ జిల్లాలో ఖాళీగా ఉన్న డేట్ లైన్లు

నల్గొండ జిల్లా: చందంపేట, డిండి, పి.ఏ.పల్లి, నాంపల్లి, మర్రిగూడ, గుర్రంపోడు, చండూర్, మునుగోడు, హాలియా, పెదవూర, నిడుమనూరు, నల్గొండ, కనగల్, మిర్యాలగూడ, త్రిపురారం, కట్టంగూర్, తిప్పర్తి, నకిరేకల్ తదితర ప్రాంతలలో పనిచేయుటకు ఆసక్తిగల వారు క్రింది ఫోన్ నంబర్లకు సంప్రదించండి.

తెలంగాణ శాసనసభ దినపత్రిక నెట్‌వర్క్ ఇంచార్జ్ వెంకటేశ్
సెల్: 9949360937,9100900931